**Dr. Sravan Kumar Dasoju**
**MLC**
**Telangana Legislative Council**

H. No: 46, Aditya Empress Park
Shaikpet, Hyderabad - 500008
Mobile No: +91 9885039384

**శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి,**

**గౌరవ ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రభుత్వం.**

**తేదీ:** 11 ఆగస్టు 2026

**విషయం: ఎల్ నినో (El Niño) పై నిపుణుల కమిటీ నివేదిక; ఇది ప్రకృతి తెచ్చిన కోపం కాదు, ప్రభుత్వం చేసిన మానవ నిర్మిత వ్యవసాయ విపత్తు! పరిపాలనా పారదర్శకత, జవాబుదారీతనం మరియు నిలదీతకు డిమాండ్ విన్నపం.**

**రిఫరెన్స్: తెలంగాణలో ఎల్ నినో పరిస్థితులు, తీవ్రత, వ్యవసాయం మరియు అనుబంధ రంగాలలో తీసుకోవాల్సిన తక్షణ ఉపశమన చర్యలపై జూలై 2026లో తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించిన నిపుణుల కమిటీ నివేదిక.**

**గౌరవనీయులైన శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారూ,**

ఈ వానకాలం సీజన్‌లో తెలంగాణవ్యాప్తంగా విరుచుకుపడ్డ సాగునీరు, వ్యవసాయ సంక్షోభం మీ ప్రభుత్వం ఊహించని ప్రకృతి వైపరీత్యం ఎంతమాత్రమూ కాదు.  ఇది మీ **ప్రభుత్వ అనాలోచిత పరిపాలనా అలసత్వం**, విధానపరమైన **అడ్డగోలు నిర్లక్ష్యం** మరియు స్పష్టమైన **ముందస్తు హెచ్చరికలను పెడచెవిన పెట్టడం** వల్ల ఏర్పడిన **మానవ నిర్మిత విపత్తు!**

**మీ స్వంత ప్రభుత్వం వేసిన నిపుణుల కమిటీయే మీ వైఫల్యాన్ని నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ల సాక్షిగా నడిబజార్లో నగ్నంగా నిలబెట్టింది. మీ ప్రభుత్వ చేతకానితనాన్ని, పరిపాలనా అజ్ఞానాన్ని వర్షాలు కురవలేదంటూ వానదేవుడి మీదకో, కాలం మీదకో నెట్టేసి మీరు చేతులు దులుపుకోలేరు. కేవలం గాలిలో దీపం పెట్టి, దేవుడా నేడే భారం అని అతితెలివిమంతుడు అన్నట్లు, "వరుణ యాగాలు" చేసేసి మీ పరిపాలనా నిర్లక్ష్యాన్ని, ఆక్షేపణీయమైన మీ చేతకానితనాన్ని దేవుడిపై నెట్టేసి, మీ పాపాన్ని కడిగేసుకోగలమని అనుకుంటే అది మీ భ్రమే అవుతుంది. మూడు నెలల ముందే స్పష్టమైన అధికారిక హెచ్చరికలు ఉన్నాయి; మీ శాఖలు ఏప్రిల్‌లో తుతు మాదిరి సమావేశాలు పెట్టి, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, క్షేత్రస్థాయి రైతుకు నిజంగా అవసరమైన నిధులు, విత్తన రాయితీలు, బీమా రక్షణ ఎందుకు కల్పించలేదో, నిధుల సిఫార్సు చేసే నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడానికి మరో మూడు నెలలు ఎందుకు పట్టిందో ప్రజలకు జవాబు చెప్పి తీరాల్సిందే!**

## 1. యాగాలు చేయడం నీటి నిర్వహణ విధానం అనిపించుకోదు

రెండు సజీవమైన బహుళార్థసాధక నదీ పరివాహక ప్రాంతాలు చుట్టూ ఉన్నప్పటికీ, **సరైన నిబంధనలను (Protocols) బేఖాతరు చేయడం వల్లే రిజర్వాయర్లు ఎండిపోతున్నాయని** మీ స్వంత ప్రభుత్వ నిపుణుల కమిటీయే అధికారికంగా రాసే **దుస్థితి వచ్చిందంటే మీ పాలన ఎంత ఘోరంగా ఉందో అర్థమవుతోంది.**

ఇలాంటి పరిస్థితుల్లో ఎంత నిష్టతో చేసినా, ఏ పూజలు, **వరుణ యాగాలు కూడా మీ పరిపాలనా అసమర్థతకు ప్రత్యామ్నాయం కాలేవు,** మీ **రాజకీయ కుట్రలను** కప్పిపుచ్చలేవు.

**యాగాలు, పూజలు చేస్తే దుర్నిర్వహణకు గురైన రిజర్వాయర్ల నుండి నీళ్లు ఉబకవు; విత్తనాల గడువు దాటిపోయాక రైతుల చేతికి విత్తనాలు రావు; Cabinet ముందు నారతీస్తున్న రాయితీ ఫైళ్లకు నిధులు విడుదల కావు!**

**పాలన అనేది మూఢనమ్మకాలతోనో, పూజలతోనో** నడిచేది కాదు; అది **సక్రమమైన విధానాల రూపకల్పన,** సకాలంలో వాటిని **అమలు చేసే నిర్ణయాలు** తీసుకోవడం, **ఫైళ్లను కదపడం, ఉత్తర్వులు జారీ చేయడం** మరియు **కాలపరిమితిలో నిధులు** విడుదల చేసి **అవినీతి లేకుండా పక్కాగా అమలు చేయడం** ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

తెలంగాణ రైతులకు **ఏప్రిల్ నెలలోనే అత్యవసర ప్రణాళిక** (Contingency Planning) అత్యవసరమైంది. మీ వ్యవసాయ శాఖ ఏప్రిల్-మే నెలల్లో క్షేత్రస్థాయి ప్రచారా తంతు కొనసాగించి, **నిధుల సిఫార్సు చేసే రాష్ట్రస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడానికి మాత్రం, విత్తనాలు వేసే కాలం చేజారిపోయే వరకు, జూలై నెల వరకు మీ ప్రభుత్వం వేచి చూసింది.**

## 2. మభ్యపెట్టే ప్రచారాలు చేశారు, కానీ నిర్ణయాత్మక చర్య, నిధుల మంజూరు మూడు నెలలు ఆలస్యమైంది

క్షేత్రస్థాయి ప్రచారం నిర్వహించడం వేరు, రైతుకు వాస్తవంగా అవసరమైన నిధులు, విత్తన రాయితీలు, బీమా రక్షణ, నీటి యాజమాన్య విధాన మార్పులను సకాలంలో అందించడం వేరు. **రాష్ట్రస్థాయిలో, బహుళ శాఖల భాగస్వామ్యంతో, నిధుల సిఫార్సులు చేసే అధికారిక ఎల్ నినో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడానికి మీ ప్రభుత్వం GO Rt No. 427 ద్వారా జూలై 18 వరకు వేచిచూసింది, దాని తొలి భేటీ జూలై 22నే జరిగింది. ఏప్రిల్ నెల ప్రచార కార్యక్రమాలకు, జూలై నెల నిధుల సిఫార్సులకు మధ్య మూడు నెలల అంతరం ఎందుకు ఏర్పడిందో, ఆ మూడు నెలల్లో రైతుకు ఎందుకు ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదో మీరు జవాబు చెప్పాల్సిందే.**

**ఇది** మీ పరిపాలనా **యంత్రాంగంలో** ప్రచారానికి, **అమలుకు** మధ్య **ఉన్న అగాధానికి** ప్రత్యక్ష సాక్ష్యం. **తీరా మీ కమిటీ సమావేశమయ్యే సమయానికి ఉత్తర మండలం (జూలై 31), మధ్య మండలం (ఆగస్టు 5), దక్షిణ మండలం (ఆగస్టు 10) ల ఆఖరి విత్తన విత్తే** గడువు **తేదీలు దగ్గరపడ్డాయి. ఏ అత్యవసర ఆర్థిక సాయం కూడా ఆ కీలక మూడు నెలల్లో రైతు పొలానికి చేరుకోలేదు.**

## 3. ప్రభుత్వం మేల్కొనే సరికి కుప్పకూలిన సాగు విస్తీర్ణం

**జూలై 2026 మధ్య నాటికి రాష్ట్రంలో కేవలం 67.78 లక్షల ఎకరాల్లో మాత్రమే** విత్తనాలు పడ్డాయి. ఇది 2025లో ఇదే సమయానికి జరిగిన సాగుతో పోలిస్తే **కేవలం 48.66% మాత్రమే!**

సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే **ఏకంగా 32.20 లక్షల ఎకరాల** మేర సాగు పడిపోయిందని, ఒక్క వరి సాగే దాదాపు 45% కుప్పకూలుతుందని మీ కమిటీయే అంచనా వేసింది. విత్తనాలు వేసే గడువులు ముగిసిపోతున్న అదే వారంలో (జూలై 19 నుండి 21 మధ్య) మీ జిల్లా ఇన్-చార్జ్ మంత్రులు సమీక్షా సమావేశాలు ప్రారంభించే సరికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

**పంట కాలం ముగిసిన తర్వాత చేసే ముందస్తు చర్యలు అసలు సన్నాహాలే కావు. అవి కేవలం కెమెరాల ముందు ప్రదర్శించే, తెలంగాణ రైతాంగాన్ని దగా చేసే కృత్రిమ నాటకాలు, పబ్లిసిటీ స్టంట్లు మాత్రమే.**

### 4. మేడిగడ్డ బ్యారేజీ: సంక్షోభాన్ని మరింత దారుణంగా మార్చిన రాజకీయ కుట్ర

అక్టోబర్ 2023లో గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన ఎత్తిపోతల నిర్మాణమైన మేడిగడ్డ బ్యారేజీకి చెందిన రెండు పిల్లర్లు కుంగిపోయాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సుల ఆధారంగా దీన్ని తీవ్ర అత్యవసర ఇంజనీరింగ్ అత్యవసర పరిస్థితిగా భావించి వేగంగా పునరుద్ధరించాల్సింది పోయి, మీ ప్రభుత్వం దీన్ని ఒక **రాజకీయ కక్షసాధింపు అవకాశంగా** మలుచుకుంది. జుడీషియల్ కమిషన్లు, సీబీఐ విచారణలు, రివ్యూల పేరుతో బ్యారేజీని, పంప్ హౌస్‌లను ఏకంగా **రెండున్నరేళ్ల పాటు ఎలాంటి మరమ్మతులు చేయకుండా గాలికి వదిలేశారు**.

దాని ప్రత్యక్ష వినాశనాన్ని తెలంగాణ ఇప్పుడు ఈ ఎల్ నినో సీజన్‌లో అనుభవిస్తోంది. మేడిగడ్డ, దాని పంపింగ్ స్టేషన్లు పనిచేయకపోవడంతో ఉత్తర, మధ్య తెలంగాణలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను నింపడానికి ఎత్తిపోయాల్సిన గోదావరి జలాలు, సరిగ్గా గోదావరి బేసిన్ నీటి మట్టాలు కనిష్ట స్థాయికి (Minimum Draw Down Level) చేరుకున్న సమయంలో ఆంధ్ర ప్రాంతానికి కొట్టుకుపోయాయి.

కాళేశ్వరం ఎత్తిపోతల వ్యవస్థ సరిగ్గా పనిచేసి ఉంటే, వర్షాభావ సమయంలో తెలంగాణ వాడుకోవడానికి పుష్కలంగా నీరు ఉండేది. రెండున్నరేళ్ల పాటు మరమ్మతులను పక్కనబెట్టి రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యమివ్వడం బాధ్యతాయుత ప్రవర్తన కాదు. **ఇది మీ ప్రభుత్వ రాజకీయ కుట్ర మాత్రమే కాదు, తెలంగాణ రైతాంగం పట్ల చేసిన అక్షమ్యమైన క్రిమినల్ నిర్లక్ష్యం!** దానికి మూల్యాన్ని నేడు తెలంగాణ రైతులు తమ రక్తాన్ని ధారపోసి చెల్లిస్తున్నారు.

### 5. ఏళ్ల తరబడి మిగులు వర్షపాతం ఉన్నా ఎండిపోయిన రిజర్వాయర్లు

2020-21 నుండి వరుసగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవ్వడమే కాకుండా, 2025-26లో తెలంగాణలో 33.5% అధిక వర్షపాతం నమోదైంది.

ఇంత సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ, గోదావరి (27.69 TMC), కృష్ణా (14.81 TMC) బేసిన్లలోని జలాలు కనిష్ఠ మట్టానికి పడిపోవడానికి మీ ప్రభుత్వ అలసత్వమే కారణం. దీనివల్ల ఎమర్జెన్సీ తాగునీటి కేటాయింపులు మాత్రమే చేస్తూ, సాగునీటి విడుదలను పూర్తిగా నిలిపివేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

"రబీ సీజన్‌లో నీటి అవసరాలు పెరగడం వల్ల క్యారీ-ఓవర్ స్టోరేజ్ (ముందస్తు నీటి నిల్వ) నిబంధనలను అమలు చేయడం లేదు" అని ICAR-CRIDA కు చెందిన మీ ప్రభుత్వ కమిటీ సభ్యుడే రికార్డు పూర్వకంగా తేల్చి చెప్పారు. ఇది ప్రకృతి చేసిన పని కాదు. ఇది స్పష్టంగా జల పరిపాలనా నిబంధనలను నిలువునా తొక్కిపడేసిన మీ **ప్రభుత్వ వైఫల్యం**.

## 6. సంక్షోభం ముంగిట్లో ఉన్నా లేని పంటల బీమా పథకం

కమిటీ సిఫార్సుల్లో ఒక దిగ్భ్రాంతికరమైన విషయముంది: "ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుండి రైతులను కాపాడటానికి సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి" అని కమిటీ ప్రభుత్వానికి సూచించాల్సి వచ్చింది. అంటే, ఒక అధికారిక వ్యవసాయ సంక్షోభం నడుస్తున్న వేళ, తెలంగాణ రైతులకు కనీస బీమా రక్షణ గొడుగు కూడా లేదని మీ నిపుణుల కమిటీయే అంగీకరించింది. ఇది ఒక సీజన్ వైఫల్యం కాదు, మీ **వ్యవసాయ విధానానికే పట్టిన పరాభవ చిహ్నం**.

## 7. కరెంట్ కోతలు & వరి కొనుగోలు గ్యారంటీలు లేకపోవడం

వర్షాభావంతో బోరుబావులపై ఆధారపడిన రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో తరచూ కోతలు విధించడం, సాగునీటి షెడ్యూళ్లపై కనీస మార్గదర్శకాలు ఇవ్వకపోవడం మీ పాలనా అలసత్వానికి నిదర్శనం. బిఆర్ఎస్ పార్టీ మొదటినుంచీ చెప్తున్నట్లే ప్రభుత్వం పంట మార్పిడి చేయాలని చెప్తూనే, వరి ధాన్యం కొనుగోళ్లను కేవలం కేంద్ర కోటాలకు మాత్రమే పరిమితం చేసి, ప్రభుత్వ మాట విని పంటలు మార్చిన రైతులను ప్రైవేట్ దళారుల చేతుల్లో బలిపెట్టింది.

## 8. ఎల్ నినో ఎదుర్కోవడానికి లేని ముందస్తు బడ్జెట్, అత్యవసర నిధులు

ఈ 95 పేజీల నివేదికలో ఎక్కడా కూడా ఈ సంక్షోభానికి ముందే కేటాయించిన అత్యవసర నిధులు (Contingency Fund) ఉన్నట్లు మీ ప్రభుత్వం చూపలేకపోయింది.

- రూ. 329.18 కోట్ల విత్తన రాయితీ; రూ. 452.80 కోట్ల సూక్ష్మ సేద్యం మరియు మల్చింగ్ సహాయం,; రూ. 35.60 కోట్ల పశుసంవర్ధక మౌలిక సదుపాయాల ప్యాకేజీ ఇవన్నీ సంక్షోభం వచ్చి ముంచెత్తాక పెట్టిన కొత్త ప్రతిపాదనలే! ఇవన్నీ నివేదిక ఇచ్చే సమయానికి ఇంకా **క్యాబినెట్ ఆమోదం కోసం మూలుగుతున్నాయి**.

రైతులు పొలాల్లో విత్తనాలు లేక, అప్పులు పుట్టక, నీళ్లు లేక అల్లాడుతున్నారనే పచ్చి నిజం మీకు కనపడటం లేదు. వాతావరణ ప్రమాదాలను తీవ్రంగా పరిగణించే ఏ ప్రభుత్వమైనా సీజన్ ప్రారంభానికి ముందే నిధులను కేటాయిస్తుంది. కానీ మీ ప్రభుత్వం ముందస్తుగా నయా పైసా కేటాయించకుండా, విత్తన సీజన్ పూర్తిగా చేజారిన తర్వాత నిధుల ఖర్చు కోసం కమిటీ అనుమతులు అడుగుతూ **ఉత్తుత్తి నాటకాలాడుతోంది**.

### 9. మభ్యపెట్టే ప్రచారం జరిగింది, ఫలితం దక్కలేదు - రైతు అవగాహన & పంట మార్పిడిలో అంతరం

ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"; జూన్ 3 నుండి 12 వరకు గ్రామసభలు కూడా నిర్వహించామని చెబుతున్నప్పటికీ, ఆ ప్రచారాల తర్వాత కూడా జూలై మధ్య నాటికి కేవలం 48.66% విస్తీర్ణంలోనే విత్తనాలు పడ్డాయంటే, 32.20 లక్షల ఎకరాల కొరత ఏర్పడిందంటే, ఆ ప్రచార కార్యక్రమాల వాస్తవ ఫలితం ఎక్కడ? **కేవలం అవగాహన కల్పించడం సరిపోదు దానికి తగిన నీటి యాజమాన్యం, విత్తన లభ్యత, రాయితీ మద్దతు, బీమా భరోసా జతకూడనిదే క్షేత్రస్థాయిలో ఫలితాలు రావు**.

***తెలంగాణ రైతులకు అవసరమైంది కేవలం సందేశాలు, ప్రచారాలు కాదు, సమయానికి అందే విత్తనం, నిధులు, నీరు, బీమా రక్షణ. ఆ నాలుగూ ఏప్రిల్-మే ప్రచారాల తర్వాత కూడా సకాలంలో అందలేదని ఈ నివేదికే స్పష్టం చేస్తోంది. ప్రచారం చేయడం ఒక్కటే సరిపోదు, దాన్ని ఆచరణలో ఫలితంగా మార్చే బాధ్యత మీ ప్రభుత్వానిదే.***

### 10. రుణాలు, పాఠశాల ఫీజుల వసూళ్లు ప్రభుత్వ నిర్లక్ష్యం బహిర్గతం

బాధిత రైతు కుటుంబాలపై **బ్యాంకులు "బలవంతపు రుణ వసూళ్లకు"** పాల్పడవద్దని SLBC ని, **పాఠశాల ఫీజుల కోసం వేధించవద్దని పాఠశాల విద్యాశాఖను** ఆదేశించాలని కమిటీ స్పష్టంగా కోరింది. రైతులు, వారి పిల్లలు బ్యాంకులు మరియు పాఠశాలల నుండి తీవ్రమైన వేధింపులకు గురవుతున్నారని చెప్పడానికి ఈ ఆదేశాలే సజీవ సాక్ష్యం. మీ ప్రభుత్వ దారుణమైన నిర్లక్ష్యం పరాకాష్టకు చేరిదనడానికి ఇది నిదర్శనం.

### 11. కేంద్ర సాయం కోరడంలోనూ విఫలం

ఈ నివేదిక సమర్పించే నాటికి కూడా, కేంద్ర అంచనా బృందాన్ని (Central Assessment Team) పంపాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయమని కమిటీ ప్రభుత్వానికి 'సిఫార్సు' చేస్తూనే ఉంది. తీవ్ర కరువు లాంటి సంక్షోభం వచ్చి నెలలు గడుస్తున్నా, కేంద్రం నుండి సాయం పొందేందుకు అవసరమైన కనీస పరిపాలనా ప్రక్రియను కూడా మీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది.

### 12. జవాబుదారీతనం కోసం డిమాండ్లు

ఇది మీ ప్రభుత్వం ఊహించలేని ప్రకృతి విపత్తు ఎంతమాత్రమూ కాదు. ఏప్రిల్‌లోనే ఐఎమ్‌డీ హెచ్చరించింది, వర్షపాతం గణాంకాలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. మీ పరిపాలనా యంత్రాంగం ఎక్కడ సమయానికి స్పందించలేకపోయిందో మీ స్వంత కమిటీ నివేదికే స్పష్టంగా ఎత్తిచూపింది. అందువల్ల ఇది **పూర్తిగా మానవ తప్పిద విపత్తు (Man-Made Disaster)**.

**ఈ మానవ తప్పిద విపత్తుకు పాలకులు, మంత్రిమండలి మరియు బ్యూరోక్రసీ బాధ్యత వహించి తీరాలి. కాబట్టి మీ ప్రభుత్వాన్ని మేము ఈ క్రింది అంశాలపై డిమాండ్ చేస్తున్నాం:**

1. **ఏప్రిల్ 2026లో నిర్వహించిన క్షేత్రస్థాయి ప్రచార కార్యక్రమాలకు (ఏప్రిల్ 25 సమీక్ష, ఏప్రిల్ 27-మే 23 రైతు ప్రచారం), జులై 18న ఏర్పాటైన నిధుల సిఫార్సు కమిటీకి మధ్య ఏర్పడిన మూడు నెలల అంతరానికి పూర్తి వివరణ ఇవ్వాలి, ఆ మూడు నెలల్లో ఎందుకు ఒక్క రూపాయి కూడా రైతుకు మంజూరు కాలేదో స్పష్టం చేసి, ఈ ఆలస్యానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని శాసనసభ ముందుకు తీసుకురావాలి.**
2. **రూ. 329.18 కోట్ల విత్తన రాయితీ**, రూ. **452.80 కోట్ల సూక్ష్మ సేద్య సాయం** మరియు కమిటీ సిఫార్సు చేసిన **అన్ని నిధులను తక్షణమే విడుదల చేసి, జిల్లాల వారీగా పంపిణీ కాలపట్టికను (Timeline) బహిరంగపరచాలి.**
3. **రెండేళ్లు మిగులు వర్షపాతం ఉన్నప్పటికీ** నీటి నిల్వ నిబంధనలను ఎందుకు అమలు చేయలేదో వివరిస్తూ రిజర్వాయర్లు మరియు రబీ నీటి యాజమాన్యంపై **శ్వేతపత్రం** విడుదల చేయాలి.
4. తెలంగాణ రైతులకు **సమగ్ర పంటల బీమా పథకాన్ని** ప్రవేశపెట్టడానికి స్పష్టమైన కాలమితిని ప్రకటించాలి.
5. ఏప్రిల్-మే 2026 నాటి క్షేత్రస్థాయి ప్రచారాలకు, జులై నాటి నిధుల మంజూరుకు మధ్య ఏర్పడిన అమలు అంతరంపై **ఒక స్వతంత్ర, కాలపరిమితితో కూడిన విచారణ కమిటీని** వేసి, దాని నివేదికను సభ ముందు ఉంచాలి.
6. ఈ నివేదికను కేవలం ఒక ముగింపు కార్యక్రమంగా చూడకుండా, ఈ సీజన్లో **రైతులు ఎదుర్కొన్న నష్టాలకు ప్రభుత్వమే పూర్తి రాజకీయ, పరిపాలనా బాధ్యత వహించాలి.**
7. అక్టోబర్ 2023లో మేడిగడ్డ పిల్లర్లు కుంగినప్పటి నుండి మరమ్మతులు ప్రారంభించే వరకు జరిగిన **రెండున్నరేళ్ల జాప్యానికి సంబంధించిన వివరాలను కాలక్రమానుసారంగా (Time-stamped Account) శాసనసభ ముందు ఉంచాలి.** ఆ సమయంలో కిందికి కొట్టుకుపోయిన నీటి పరిమాణం ఎంత, అది ఈ ఎల్ నినో కాలంలో రిజర్వాయర్ల కొరతకు ఎలా కారణమైందో లెక్కలతో సహా వివరించాలి.

తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతాంగం, ముందస్తు ఆలోచనతో పాలించే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ ప్రజలమైన మేము **పరిపాలనా పారదర్శకత, జవాబుదారీతనం మరియు బాధ్యతాయుత ప్రవర్తనను డిమాండ్ చేస్తున్నాం. చవకబారు డ్రామాలు, మభ్యపెట్టే రాజకీయాలు, పూజలు, యాగాలు మాకు వద్దు. మీ నుండి నిజాయితీతో కూడిన, స్పష్టమైన సమాధానాన్ని ఆశిస్తున్నాం. తెలంగాణ ప్రజలను, రైతాంగాన్ని కాపాడే ప్రణాళిక తెలియచేయాలని డిమాండ్ చేస్తున్నాము.**

**భవదీయుడు,**

**డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్**

ప్రతులు:

1. **శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి, తెలంగాణ ప్రభుత్వం.**
2. **శ్రీ ఎస్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, గౌరవ నీటిపారుదల శాఖ మంత్రి, తెలంగాణ ప్రభుత్వం.**
3. **డాక్టర్ జి. చిన్నారెడ్డి, ఛైర్మన్, ఎల్ నినో నిపుణుల కమిటీ & వైస్ ఛైర్మన్ TSPB.**
4. **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వం.**